ఏజెంట్లుగా కూర్చున్నారని టీడీపీ వర్గీయులపై దాడి

వైసీపీ గూండాగిరి..!

పలువురికి గాయాలు.. ఓబుళనాయునిపల్లిలో ఉద్రిక్తత



తీవ్రంగా గాయపడిన బోగ లింగమయ్య

ధర్మవరం రూరల్, మే 14: వైసీపీ మూకలు పేట్రేగిపోయాయి. ధర్మవరం మండల పరిధి ఓబుళనాయునిపల్లిలో గూండాగిరి ప్రదర్శించాయి. కూటమి ధర్మవరం అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ తరపున ఏజెంట్లుగా కూర్చున్న వారిపై వైసీపీ వర్గీయులు దాడి చేశారు. మంగళవారం ఉదయం రాళ్లు, కర్రలతో విరుచుకుపడ్డారు. దీంతో పలువురు గాయపడ్డారు. గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు బోగ లింగమయ్య కుమారుడు సింహాద్రి.. కూటమి అభ్యర్థి తరపున పోలింగ్ ఏజెంటుగా కూర్చున్నాడు. గ్రామానికి చెందిన శివ, ఆది కూటమి అభ్యర్థి తరపున విస్తృతంగా ప్రచారం చేశారు. దీనిని జీర్ణించుకోలేని



కళాజ్యోతి సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న బాధితుల కుటుంబీకులు

వైసీపీ వర్గీయులు గడుపూటి గంగాధర్‌నాయుడు, ఆదినారాయణ, దాసరి శ్రీనివాసులు, శేషయ్య, కేశన్న, సాకే సోమశేఖర్, గడుపూటి నారాయణస్వామి, బాలసాయి, చరణ్‌కుమార్, అనంతరాయుడు, బాల బొజ్జన్న, ప్రవీణ్‌నాయక్, అనంతరాముడు ఒక్కసారిగా లింగమయ్య ఇంటిపై రాళ్లు, రాడ్లతో దాడులకు తెగబడ్డారు. బోయ సామాజికవర్గీయుల ఇళ్లపై వైసీపీ మూకలు రాళ్లు విసరడంతో మహిళలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ దాడుల్లో టీడీపీ వర్గీయులు లింగమయ్య, ఆయన కుమారుడు సింహాద్రి, పవన్, రాయుడు, సాలమ్మ, రాజు, శివయ్య, ఆది, శివ తదితరులు గాయపడ్డారు. వారిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితులు పెద్దఎత్తున ధర్మవరం డీఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకుని, ఆందోళన చేపట్టారు. ఎన్నికల్లో పనిచేస్తే దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దాడిచేసిన వైసీపీ గూండాలు చాలా కేసుల్లో నిందితులుగా ఉన్నారనీ, వారిపై రౌడీషీట్లు ఉన్నాయన్నారు. దాడి చేసినవారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడి నుంచి కళాజ్యోతి సర్కిల్‌కు చేరుకుని, రాస్తారోకో చేశారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. రూరల్ ఎస్‌ఐ నరేంద్ర ఆస్పత్రికి చేరుకుని, బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ ఆస్పత్రికి చేరుకుని, బాధితులను పరామర్శించారు. దాడిని తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక వైసీపీ పాలనకు తెరపడుతుందనీ, కూటమి అధికారంలో రాగానే ఇలాంటి గూండాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధైర్యంగా ఉండాలని బాధితులకు చెప్పారు.



ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న సత్యకుమార్ యాదవ్

చోళసముద్రంలో మళ్లీ ఘర్షణ

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామంలో మంగళవారం మరోసారి ఘర్షణ తలెత్తింది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం ప్రాథమికోన్నత పాఠశాల పోలింగ్ బూత్‌వద్ద ఇరువర్గాలు ఘర్షణ పడిన విషయం తెలిసిందే. పోలీసులు రంగప్రవేశం చేసి, ఇరువర్గాలను చెదరగొట్టారు. మంగళవారం సాయంత్రం ఇదే పాఠశాల ప్రాంగణంలో ప్రధాన రహదారిపై ఇరువర్గాలు మరోసారి గొడవపడ్డాయి. నడిరోడ్డుపై గొడవపడి బీరుబాటిళ్లు విసురుకోవడంతో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఎస్‌ఐ గోపి సిబ్బందితో వెళ్లి లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఎప్పుడేం జరుగుతుందోనని గ్రామప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు

పోలింగ్ కేంద్రాల నుంచి రాత్రంతా తరలింపు



స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, మే14(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల పార్లమెంట్ అసెంబ్లీ పోలింగ్ ఈవీఎంలు బ్యాలెట్ బ్యాక్సులను స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచారు. జిల్లాలో హిందూపురం పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ స్థానాలకు ఎన్నికల పోలింగ్ సోమవారం నిర్వహించిన



స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలను తీసుకొస్తున్న సిబ్బంది

సంగతి తెలిసిందే. జిల్లావ్యాప్తంగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. ఓటర్లు బారులు తీరడంతో పలుచోట్ల అర్ధరాత్రి వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. పార్లమెంటుతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 84.82 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ అలస్యం కావడంతో ఈవీఎంల తరలింపు అర్ధరాత్రి అయినా కొనసాగుతూనే ఉంది. ఒక్కొక్కటిగా కౌటింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంల వద్దకు మంగళవారం తెల్లవారుజామున చేరుకున్నాయి. జిల్లాలో లేపాక్షి మండలం చోళసముంద్రంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల ఈవీఎంలు స్ట్రాంగ్ రూంల్లో భద్రపరిచారు. హిందూపురంలోని బిట్స్ కళాశాలకు మడకశిర, పెనుకొండ, కదిరి, హిందూపురం నియోజకవర్గాల ఈవీఎంలు, బ్యాలెట్ బ్యాక్సులను చేర్చారు. రాప్తాడు ఈవీఎంలను అనంతపురంలోని జేఎన్‌టీయూలో భద్రపరిచారు. మంగళవారం స్ట్రాంగ్ రూంలకు ఎన్నికల పరిశీలకులు ఇమ్నాలెస్నా, అన్బుకుమార్, కలెక్టర్ అరుణ్‌బాబు, ఆయా పార్టీల అభ్యర్థుల సమక్షంలో సీలు వేశారు. స్ట్రాంగ్ రూంల వద్ద ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులతో పాటు జిల్లా కలెక్టర్, ఏఎస్పీ విష్ణు పర్యవేక్షించారు.



సమాలోచనలు.. సమీక్షలు..

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ముగిసింది. ఆయా పార్టీల అభ్యర్థులు మంగళవారం సమీక్షలు, సమాలోచనల్లో మునిగి తేలారు. అభ్యర్థులు పోలింగ్, విజయావకాశాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమాలోచనలు సాగించారు. ఓటేసిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

మడకశిరలోనే ఎంఎస్ రాజు



మడకశిర: కూటమి మడకశిర అభ్యర్థి ఎంఎస్ రాజు స్థానిక యాదవ కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో పోలింగ్ సరళిపై సమీక్షించారు. పంచాయతీలు, బూత్‌ల వారీగా టీడీపీకి ఓట్లు ఎలా నమోదయ్యాయనే అంశంపై అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సమీక్షించారు.

రోజంతా కార్యాలయంలోనే...



పెనుకొండ టౌన్: కూటమి అభ్యర్థి సవిత రోజంతా పెనుకొండలోని పార్టీ కార్యాలయంలోనే గడిపారు. నియోజకవర్గవ్యాప్తంగా పోలింగ్ సరళిపై నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. బూత్‌లవారీగా పోలింగ్, మెజార్టీపై ఆరాతీశారు.

పరామర్శ..



ధర్మవరం: కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో చర్చించారు. పోలింగ్‌పై ఆరాతీశారు. అనంతరం వైసీపీ నాయకుల దాడిలో గాయపడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మధ్యాహ్నం 3గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

బెంగళూరుకు చలో.. చలో..

పుట్టపర్తి: మొదటిసారి ఎన్నికల బరిలో నిలిచిన కూటమి అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి మంగళవారం పిల్లలు, భర్త పల్లె వెంకటకృష్ణకిశోర్‌రెడ్డితో కలిసి బెంగళూరు వెళ్లారు. రెండునెలలుగా ఎన్నికల ప్రచారంలో క్షణం తీరిక లేకుండా గడిపారు. పిల్లలకు దాదాపు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో రెండురోజులు పాటు పిల్లల సంతోషం కోసం బెంగళూరు వెళ్లారు.





గాయపడిన నాయకుడిని పరామర్శిస్తున్న కందికుంట

ఏంటి.. విశేషాలు?

కదిరి: కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ స్థానిక తన కార్యాలయంలోనే గడిపారు. తనను కలిసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పోలింగ్ విశేషాలు అడిగి తెలుసుకున్నారు. తనకల్లు మండలంలోని దునిగేపల్లిలో వైసీపీ మూకల దాడిలో గాయపడిన మధుసూదన్‌రెడ్డిని పరామర్శించారు. సాయంత్రం కూడా కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు.

హైదరాబాద్‌కు బాలయ్య



హిందూపురం: ప్రచారంలో నెలరోజులుగా నిమగ్నమైన ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి నందమూరి బాలకృష్ణ మంగళవారం వేకువజామునే హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు. గత నెల మొదటి వారంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన బాలయ్య సొంత నియోజకవర్గం హిందూపురంతోపాటు, పలు జిల్లాల్లో రోజుకు రెండు, మూడు రోడ్‌షోలు నిర్వహించారు. కూటమి తరపున స్టార్ క్యాంపెయినర్‌గా ప్రచారం నిర్వహించారు. హిందూపురంలో పది రోజులుగా ప్రచారం చేస్తున్నారు. పోలింగ్ ముగియడంతో హైదరాబాద్ వెళ్లారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్ వివరాలిలా..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	ఓటింగ్ శాతం
హిందూపురం	2,49,174	1,93,905	97,653	96,246	6	77.82
కదిరి	2,53,420	2,06,205	1,02,409	1,03,789	7	81.37
పెనుకొండ	2,35,986	2,05,203	1,03,613	1,01,588	2	86.96
మడకశిర	2,10,804	1,84,524	93,487	91,037	0	87.5
పుట్టపర్తి	2,11,062	1,82,100	90,962	91,126	7	78.33
ధర్మవరం	2,45,758	2,18,296	1,09,010	1,09,271	15	88.83

అంతకు మించి..

జిల్లాలో రికార్డు పోలింగ్

- 84.82 శాతం నమోదు
- ధర్మవరంలో అత్యధికంగా 88.82 శాతం..
- హిందూపురంలో అత్యల్పంగా 77.81 శాతం..
- బుళ్లసముద్రంలో వంద శాతం పోలింగ్
- ఓటెత్తిన మహిళలు

పుట్టపర్తి, మే 14: ఓటర్లు పోటెత్తారు. జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు క్యూకట్టారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు. రికార్డుస్థాయి పోలింగ్ నమోదైంది. నూతన జిల్లాలో మొదటిసారి నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో అత్యధిక శాతం నమోదైంది. 2019 కన్నా 2 శాతం ఎక్కువగా నమోదైంది. జిల్లాలో 16,56,775 మంది ఓటర్లు ఉండగా.. 14,05,277 ఓట్లు పోలయ్యాయి. తద్వారా హిందూపురం పార్లమెంటు స్థానంలో 84.82 శాతం ఓటింగ్ నమోదైంది. ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా ధర్మవరంలో 88.82 శాతం, హిందూపురంలో 77.81 శాతం ఓట్లు పడ్డాయి.



బుళ్ల సముద్రంలో వందశాతం..

మడకశిర రూరల్: మండలంలోని బుళ్ళసముద్రం గ్రామంలోని 180వ నంబరు పోలింగ్ బూత్‌లో వంద శాతం పోలింగ్ నమోదైంది. ఓటర్లు అందరూ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ బూత్ పరిధిలో మొత్తం 628 ఓట్లు ఉన్నాయి. అందులో పురుషులు 318 మంది, మహిళలు 310 మంది ఉన్నారు. సోమవారం పోలింగ్‌లో అందరూ ఓటేశారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.5

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. అనంతపురం అర్బన్				
2. రాప్తాడు				
3. శింగనమల				
4. తాడిపత్రి				
5. గుంతకల్లు				
6. ఉరవకొండ				
7. కళ్యాణదుర్గం				
8. రాయదుర్గం				
9. ధర్మవరం				
10. కదిరి				
11. పుట్టపర్తి				
12. పెనుకొండ				
13. హిందూపురం				
14. మడకశిర				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసే వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 239-2ఎ, బెంగళూరు బైపాస్, కక్కలపల్లి క్రాస్, అనంతపురము- 515001.


సూర్యముని ఇంటివద్ద వైసీపీ వర్గీయులు

యుద్ధభూమి.. తాడిపత్రి

రెండోరోజు కొనసాగిన వైసీపీ గూండాగిరి

- టీడీపీ నాయకుడు సూర్యముని ఇంటిపై దాడి
- టీడీపీ శ్రేణుల ఎదురుదాడితో రణరంగం
- పట్టణ సీఐకి గాయాలు..
- పోలీసు వాహనాలు ధ్వంసం
- జేసీ ప్రభాకర్.. పెద్దారెడ్డి ఇళ్ల వద్ద మరోమారు దాడులు
- గంటలు గడిచినా అదుపులోకి రాని పరిస్థితి
- చేతులెత్తేసి.. చోద్యం చూసిన పోలీసులు
- ఆందోళనకు దిగిన జేసీ ప్రభాకర్..
- అడ్డుకున్న పోలీసులు
- ఫిర్యాదు తీసుకోకుండా.. పట్టణ పోలీస్ స్టేషన్‌కు తాళం


గాయపడ్డ సీఐ మురళీకృష్ణ



తాడిపత్రి టౌన్, మే 14: అనంతపురం జిల్లా తాడిపత్రిలో వైసీపీ హింస కొనసాగుతోంది. పోలింగ్ రోజున సోమవారం వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వీరంగం సృష్టించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన అనుచరవర్గం దాడులకు పాల్పడింది. తాడిపత్రిలో ఏకంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఆయన తనయులు, అనుచరులు టీడీపీ కూటమి అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వాహనాలను ధ్వంసం చేశారు. రెండో రోజు మంగళవారం మంగళవారం మధ్యాహ్నం 3గంటల నుంచి మరింత రెచ్చిపోయారు. రాత్రి 9 గంటల వరకు యథేచ్ఛగా దాడులు కొనసాగించారు. దీంతో తాడిపత్రి రణరంగంగా మారింది.

సూర్యముని ఇంటిపై దాడి..

తాడిపత్రి పట్టణంలోని గానుగవీధిలో టీడీపీ సీనియర్ నాయకుడు సూర్యముని ఇంటిపై వైసీపీ అల్లరి మూకలు మంగళవారం మధ్యాహ్నం రాళ్ల వర్షం కురిపించాయి. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నాయి. అక్కడ ఇరువర్గాలు పెద్దఎత్తున రాళ్లు రువ్వుకోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణ వెంటనే అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాలను చెల్లాచెదురు చేయడానికి ఎంత ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. వైసీపీ వర్గీయుల రాళ్లదాడిలో పట్టణ సీఐ మురళీకృష్ణ తలకు గాయమైంది. సీఐ, ఎస్ఐ వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భాష్పవాయువును ప్రయోగించారు. దీంతో పరిస్థితి కొద్దిసేపు అదుపులోకి వచ్చింది. సూర్యముని ఇంటిపై దాడి గురించి తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పెద్దఎత్తున అనుచరులతో కలిసి ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. ఆయన వస్తే పరిస్థితి చేయి దాటుతుందని గమనించిన పోలీసులు అడ్డుకున్నారు. తమ పార్టీ నాయకుడిని పరామర్శించేందుకు వెళుతుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ఆయన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. శాంతిభద్రతల దృష్ట్యా వెనుదిరగాలని అడిషనల్ ఎస్పీ సూచించారు.


గాయపడ్డ టీడీపీ కార్యకర్త గంగాధర్


పెద్దారెడ్డి ఇంటిపైనుంచి టీడీపీ వర్గీయులపై రాళ్లు రువ్వుతున్న దృశ్యం

పోలీసుల అభ్యర్థనతో..

శాంతిభద్రతల దృష్ట్యా పోలీసుల అభ్యర్థన మేరకు సూర్యముని ఇంటివద్ద నుంచి చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులతో కలిసి వెనుదిరిగారు. అక్కడి నుంచి ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వైసీపీ అల్లరిమూకలపై ఫిర్యాదు చేయడానికి బయలుదేరారు. సమాచారం అందుకున్న పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తాళం వేశారు. గేటు తీయాలని, ఫిర్యాదు చేసి వెళతానని జేసీ ప్రభాకర్ రెడ్డి ఎంత చెప్పినా పోలీసులు వినలేదు. ఎంతసేపటికి తాళాలు తీయకపోవడంతో ఆయన శాంతియుతంగా ధర్నా చేసేందుకు అనుచరవర్గంతో కలిసి గాంధీసర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడ చైర్ వేసుకొని కూర్చొని నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న టీడీపీ నాయకులు కాకర్ల రంగనాథ్, జగదీశ్వరరెడ్డి అనుచరులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పెద్దఎత్తున గాంధీసర్కిల్‌కు చేరుకొని ధర్నాలో పాల్గొన్నారు. అడిషనల్ ఎస్పీతో పాటు డీఎస్పీ గంగయ్య, సిబ్బంది గాంధీసర్కిల్‌కు చేరుకుని ధర్నా విరమించి వెళ్లిపోవాలని జేసీ ప్రభాకర్ రెడ్డిని హెచ్చరించారు. దీంతో శాంతియుతంగా ధర్నా చేసే హక్కు కూడా లేదా అంటూ ఆయన పోలీసులపై మండిపడ్డారు. శాంతిభద్రతలకు ఇబ్బంది కలుగుతుందని, వెంటనే ఖాళీ చేయాలని సూచించడంతో ఆయన అనుచరులతో కలిసి సీబీ రోడ్డు మీదుగా నడుచుకుంటూ ఇంటికి బయలుదేరారు. కానీ వైఎస్సార్ సర్కిల్ దాటగానే మరోసారి పోలీసులు అడ్డుకున్నారు. కోడ్ అమలులో ఉందని, భారీ జనాలతో వెళ్లరాదని, వాహనంలో వెళ్లిపోవాలని అడిషనల్ ఎస్పీ సూచించారు. చేసేదేమిలేక ఆయన వాహనం ఎక్కి వైఎస్ సర్కిల్, గాంధీసర్కిల్, పుట్లూరురోడ్డు, సంజీవనగర్ మీదుగా తన నివాసానికి చేరుకున్నారు. పరిసర మండలాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో జేసీ ప్రభాకర్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు.


ధ్వంసమైన పోలీసు జీపు

ఇరువర్గాలపై కేసు నమోదు

పోలింగ్ రోజున ఓంశాంతినగర్‌లో చోటుచేసుకున్న రాళ్లదాడులకు సంబంధించి ఇరువర్గాల నాయకులపై కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, టీడీపీ నేత జేసీ పవన్‌రెడ్డితోపాటు సుమారు వంద మందిపై కేసులు నమోదుచేశారు. జేసీ అస్మిత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, సాయిప్రతాప్‌రెడ్డి, మరికొందరు వైసీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు.


సూర్యమునిని పరామర్శిస్తున్న జేసీపీఆర్


గాంధీసర్కిల్‌లో జేసీపీఆర్ ఆందోళన

మరోసారి వైసీపీ దాడులు..

టీడీపీ శ్రేణులు పట్టణానికి పెద్దఎత్తున వచ్చాయని తెలుసుకున్న వైసీపీ అల్లరిమూకలు మరోసారి రెచ్చిపోయాయి. జేసీ ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇళ్లకు మధ్యలో జూనియర్ కళాశాల మైదానం ఉంది. ఇరువర్గాల వారు ఈ మైదానాన్ని దాడులకు వేదికగా చేసుకొని దాదాపు గంటలపాటు రాళ్లు రువ్వుకున్నారు. పెద్దారెడ్డి ఇంటిపై నుంచి వైసీపీ వర్గీయులు రాళ్లు విసురుతుండడంతో టీడీపీ కార్యకర్తలు పరుగులు తీశారు.

దీపావళి 'రాకెట్' దాడులు..

టీడీపీ శ్రేణులను భయపెట్టడానికి వైసీపీ వర్గీయులు దీపావళిరోజున పేల్చే రాకెట్లను ప్రయోగించారు. దూరం నుంచి చూసేవారికి కాలేజీ మైదానంలో పేలుళ్లు జరుగుతున్నట్లు భ్రమ కలిగింది. ఏం జరుగుతుందోనని టీడీపీ వర్గీయులు భయభ్రాంతులకు గురయ్యారు. బాణ సంచా అని తెలుసుకుని.. వారు కూడా అదే తరహాలో పెద్దారెడ్డి ఇంటివైపునకు రాకెట్లను వదిలారు.

ట్రాక్టర్లలో రాళ్లు..

మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసం వద్దకు పెద్దఎత్తున అనుచరులు చేరుకున్నారన్న విషయం తెలుసుకున్న వైసీపీ శ్రేణులు ముందస్తుగా ట్రాక్టర్లతో రాళ్లను సిద్ధం చేసుకున్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటివద్దకు అనుచరులు భారీ చేరుకొన్నారు. అక్కడ ఇరువర్గాలు పరస్పర రాళ్లదాడులకు దిగారు. మరోసారి పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు. జూనియర్ కళాశాల మైదానంలో కూడా టీడీపీ, వైసీపీ వర్గీయులు పెద్దఎత్తున రాళ్లు రువ్వుకోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. పోలీసు సిబ్బంది తక్కువగా ఉండడంతో పరిస్థితి గంటలు దాటినా అదుపులోకి రాలేదు. చివరికి సీఆర్‌పీఎఫ్ బలగాలు తాడిపత్రికి చేరుకున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పురాలేదు. రాత్రి 9 గంటలైనా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

చేతులెత్తేసిన పోలీసులు

దాదాపు ఐదు గంటలపాటు శ్రమించినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో పోలీసులు చేతులెత్తేశారు. ఎంతో సమస్యాత్మకమైన తాడిపత్రిలో పోలీసు అధికారుల ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే పరిస్థితి ఇలా తయారైంది. తగినంత భద్రతకు పోలీసు సిబ్బందిని మోహరించాల్సిన అధికారులు ఏమీపట్టనట్లు వ్యవహరించారు. ఓంశాంతినగర్, పాతకోటలో రాళ్లదాడి జరుగుతుంటే పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పోలీసులు తమ వాహనంలో నింపాదిగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి, రక్షణ కవచాలు తీసుకుని బయలుదేరారు. బందోబస్తు విషయంలో నిర్లక్ష్యం వహించారు. మైదానంలో ఇరువర్గాలు తలపడుతున్నా పోలీసులు నిలబడి చోద్యం చూశారు. పోలింగ్ ముగియడంతో ప్రశాంతంగా ఉండొచ్చని భావించిన తాడిపత్రి ప్రజలు మంగళవారం జరిగిన ఘటనతో భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీసులు పట్టణంలో వ్యాపార సముదాయాలను మూసివేయించారు.

పోలీసుల అదుపులో పెద్దారెడ్డి

తాడిపత్రిలో రెండురోజుల నుంచి జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసానికి ఎస్పీ అమిత్ బర్దర్, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ గంగయ్య వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఆయనను ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్లారు. ఎక్కడికి అనే సమాచారాన్ని బహిర్గతం చేయలేదు.

వైసీపీ గూండాల దాడులు హేయం

తాడిపత్రి ఘటనలను ఖండించిన టీడీపీ నాయకులు

దాడులు హేయం: కాలవ



అనంతపురం అర్బన్, మే 14: తాడిపత్రిలో టీడీపీ నాయకుడు సూర్యముని ఇంటిపై వైసీపీ గూండాలు రాళ్ల దాడులకు పాల్పడటం హేయమని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఒక ప్రకటనలో మండిపడ్డారు. తాడిపత్రి పట్టణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ గూండాలు దాడులకు దిగుతున్నా పోలీసులు కేతిరెడ్డి పెద్దారెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఓటమి భయంతోనే వైసీపీ అల్లరి మూకలు టీడీపీ నాయకులపై భౌతిక దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. తాడిపత్రిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఎమ్మెల్యేతోపాటు వైసీపీ గుండాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓటమి భయంతోనే..

- వెంకటశివుడు యాదవ్



తాడిపత్రిలో ఓటమి భయంతోనే ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తమ పార్టీ నాయకులపై దాడులు చేయిస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. పోలింగ్ రోజునే పెద్దారెడ్డి తన అనుచరులతో టీడీపీ నాయకులపై రాళ్ల దాడి చేయించారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పోలీసు యంత్రాంగం తాడిపత్రిలో పటిష్ట భద్రత కల్పించే ఉంటే రెండో రోజు ఈ దాడులు జరిగేవి కాదన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు సూర్యముని ఇంటిపై రాళ్ల దాడి చేయడం దారుణమన్నారు. వైసీపీ పాలనలో బీసీలను టార్గెట్‌గా చేసుకొని దాడులకు తెగబడుతున్నారనేందుకు సూర్యముని ఇంటిపై రాళ్ల దాడే నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డిని టార్గెట్‌గా చేసుకొని ఆయన ఇంటిపైనా రాళ్ల దాడులకు తెగబడటం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రిలో శాంతి భద్రతలకు విఘాతం కలించాడని, ఎన్నికల సంఘం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. దాడులకు పాల్పడిన ఎమ్మెల్యేతోపాటు వైసీపీ అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాడులు సిగ్గుచేటు: అంబికా



తాడిపత్రిలో టీడీపీ నాయకులపై ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన అనుచరులు దాడులకు పాల్పడటం సిగ్గుచేటని అనంతపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో జీర్ణించుకోలేక టీడీపీ నాయకులపై దాడులకు తెగబడుతున్నారన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన బోయ సూర్యముని ఇంటిపై రాళ్ల దాడికి పాల్పడం హేయమన్నారు. తాడిపత్రిలో టీడీపీ నాయకులపై దాడులకు కారణమైన ఎమ్మెల్యే పెద్దారెడ్డి, వైసీపీ అల్లరి మూకలను అరెస్టు చేసి కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాడిపత్రితోపాటు కళ్యాణదుర్గం, పుట్లూరు, ఇతర ప్రాంతాల్లో వైసీపీ అల్లరి మూకలు టీడీపీ నాయకులపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయన్నారు. పోలింగ్ ముగిసిన ఒక రోజుకే వైసీపీ అరాచకాలు ఇలా ఉంటే.. ఓట్ల లెక్కింపు సమయంలో ఇంకా ఎంతగా బరిగెతిస్తారో అర్థమవుతోందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు ఉన్నతాధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.

గుంతకల్లు క్రూ లాబీ వద్ద లోకోపైలెట్ల ధర్నా

గుంతకల్లు, మే14: వేరే డివిజన్లలో చిన్న చిన్న (సైడింగ్) స్టేషన్ల వద్ద ఉన్న ఫ్యాక్టరీల్లో ఉద్యోగులను పంపి పనిచేయించడానికి యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకోవడం అన్యాయమని రైల్వే లోకో పైలెట్లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక క్రూ కంట్రోల్ లాబీ వద్ద లోకో పైలెట్లు నేలపైన కూర్చుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే వివిధ పనుల కారణంగా లోకో రన్నింగ్ స్టాఫ్ ఇబ్బందులకు గురౌతున్నారని తెలిపారు. ఇటువంటి నిర్ణయాలతో ఉద్యోగులు మరింత ఒత్తిళ్లకు లోనౌతారని, వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఎల్ఆర్ఎస్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ఎం బాషా, నాయకులు నరేశ్, దివాకర్, లోకో రన్నింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.


క్రూకంట్రోల్ లాబీ వద్ద ధర్నా నిర్వహిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు వన్‌టైం నోటిఫికేషన్

1994-2014 మధ్య పాస్‌కాని వారికి అవకాశం

అనంతపురం సెంట్రల్, మే 14: ఎస్కేయూ ఆధ్వర్యంలో డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఒక్కసారి అవకాశం పేరుతో నోటిఫికేషన్ విడుదల చేశామని పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు 1994-95 నుంచి 2014-15వరకు డిగ్రీలో ఫెయిలయిన విద్యార్థులందరూ అర్హులని పేర్కొన్నారు. జూన్ 14వరకు పరీక్షా ఫీజు చెల్లింపు గడువు విధించామన్నారు. ఫీజు చలానా, నామినల్ రోల్స్‌తోపాటు దరఖాస్తు కాపీలను సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు జూన్ 18లోపు ఎస్కేయూ పరీక్షల విభాగంలో సమర్పించాలని సూచించారు. రూ.1000 ఫైన్‌తో జూన్ 21వరకు, రూ.3వేల ఫైన్‌తో 28లోపు చెల్లించ వచ్చన్నారు. పరీక్షల నిర్వహణ తేదీ ముందురోజు వరకు ఫీజుతోపాటు రూ.5వేల ఫైన్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక సబ్జెక్టుకు రూ.2వేలు, రెండు సబ్జెక్టులకు రూ.3వేలు. మూడు నుంచి ఆపై ఎన్ని సబ్జెక్టులున్నా రూ.4వేల ఫీజును నిర్ధారించామని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి తృ తీయ సంవత్సరం కళాశాలను వీడిన విద్యార్థులు రూ.3వేల ఫైన్‌తో పరీక్షల ఫీజు కట్టవచ్చు అన్నారు. కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా ఎస్కేయూ ఆధ్వర్యంలో డిగ్రీ చేసిన విద్యార్థులున్నారని, వారందకీ వన్ టైం చాన్స్ పేరుతో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పరీక్షలు, ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఎప్పుడు నిర్వహించేది టైంటేబుల్‌ను త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని అనంతపురం కేఎస్ఎన్ మహిళా ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేస్తామన్నారు. వివరాలకు **www.skuniversity.ac.in** వెబ్‌సైట్‌ను సందర్శించాలని వారు సూచించారు.

పేద బ్రాహ్మణ విద్యార్థినులకు ఉపకారవేతనాలు

అనంతపురం క్లాక్‌టవర్: పేద బ్రాహ్మణ విద్యార్థినులకు ప్రతి ఏటా అందజేసే ఉపకారవేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని బ్రాహ్మణ విద్యార్థిని మహిళా సంక్షేమ సంఘం కార్యదర్శి రమాదేవి తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆరోతరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న పేద బ్రాహ్మణ బాలికలు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9703789201, 9490130999ను సంప్రదించాలని తెలిపారు.

అంతటా ఉత్కంఠ..!

భారీ పోలింగ్‌పై చర్చలే చర్చలు
ఓటింగ్ సరళిపై అభ్యర్థుల సమీక్షలు
గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

పుట్టపర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): 'అన్నా.. నియోజకవర్గంలో పరిస్థితి ఏంది? ఎవరు గెలుస్తారు? ఏ మండలంలో ఎవరికి మెజార్టీ వస్తుంది? పోలింగ్ శాతం భారీగా పెరగడం ఎవరికి మేలు చూకూరుస్తుందంటావ్? రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది?' సర్వత్రా ప్రస్తుతం ఇవే చర్చలు. అంతటా ఒకటే ఉత్కంఠ. ఎవరు ఫోన్ చేసినా.. ఎక్కడు ఇద్దరు కలిసినా ఇవే చర్చోపచర్చలు వినిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ముగియడంతో గెలుపోటములపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గెలుపోటములపై అభ్యర్థులు లెక్కలేసుకుంటున్నారు. ఏ గ్రామంలో, ఏ పోలింగ్ బూత్‌లో ఎన్ని ఓట్లు వచ్చాయి, ఎక్కడ మెజార్టీ ఉంది, ఎక్కడ తక్కువగా వస్తుందన్న అంశాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగిన సంగతి తెలిసిందే. పోలింగ్ ముగియడంతో మంగళవారం ఆయా నియోజకవర్గాల్లో కూటమి, వైసీపీ అభ్యర్థులు పోలింగ్ బూత్‌లవారీగా నాయకులను పిలిపించుకుని, పోలింగ్ సరళిని ఆరా తీశారు. జిల్లావ్యాప్తంగా 84.82శాతం పోలింగ్ నమోదు కాగా.. అత్యధికంగా ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 88.82 శాతం, అత్యల్పంగా హిందూపురంలో 77.81 శాతం నమోదైంది. రాప్తాడు, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో 80 శాతంపైగా పోలింగ్ నమోదైంది. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై అభ్యర్థులు సమీక్షలు జరిపారు. పంపిణీ చేసిన నోటు, మద్యం, తాయిలాలు ఓటరుకు ఎలా చేరాయి? వారి మనోగతం ఎలా ఉంది? ఏ పార్టీకి ఓటేశారు అనే అంశాలపై సామాజిక వర్గాలుగా లెక్కలేశారు. గత ఎన్నికల కంటే భిన్నంగా ఉదయం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఈ పరిణామం కూటమికి అనుకూలమన్న చర్చ సాగుతోంది. మహిళలు, యువత ఓటెత్తడం చర్చనీయాంశమైంది.



అన్నా.. ఎవరు గెలుస్తారు..?

ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు? రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందన్న విషయాలపై మంగళవారం జిల్లా అంతటా చర్చలు సాగాయి. ఏ ఇద్దరు కలిసినా ఇదే చర్చ వినిపించింది. ఎన్నికల్లో అధికార పార్టీ నోటు, మద్యం వెదజల్లింది. ఒక్కో అభ్యర్థికి రూ.30 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు అంచనా. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి పోలింగ్ రోజు వరకు ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. ఇంత ఖర్చు చేసినా.. పోలింగ్ సరళి అధికార పార్టీ వర్గాల్లో కలవరం రేపుతోంది. భారీగా పోలింగ్ నమోదవడం ప్రభుత్వ వ్యతిరేకతేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ, ఉపాధి కల్పనలో ప్రభుత్వ వైఫల్యం పట్ల ఆగ్రహంగా ఉన్న యువత ఓటుకు పోటెత్తారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మహిళలు భారీగా తరలిరావడం ఎవరికి లాభదాయకమన్న చర్చలు సాగుతున్నాయి. ఏదిఏమైనా ఓటరు నాడి పట్టేందుకు పోలింగ్ కేంద్రాల వారీగా ఆయా గ్రామాల నాయకుల ద్వారా సమాచారం తెప్పించుకుంటున్నారు. గెలుపుపై ఎవరి ధీమా వారిదే అన్నట్లు కనిపిస్తోంది.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ వర్గీయులు

కళ్యాణదుర్గం రూరల్, మే 14: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు మంగళవారం దాడి చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం టీడీపీ, వైసీపీ నాయకులు దాడులు, ప్రతి దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో గాయపడ్డ టీడీపీ కార్యకర్తలు కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అంతటితో ఆగని వైసీపీ రౌడీ మూకలు కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చొరబడి చికిత్స పొందుతున్న మహిళలపై దాడులకు తెగబడ్డారు. చెప్పులతో కొట్టి, తాళిబొట్లు తెంచినట్లు బాధిత మహిళలు ఆరోపించారు. దాడిలో గాయపడ్డ అనసూయమ్మను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో ముగ్గురు కార్యకర్తలు నరసింహులు, జ్యోతి, లలితమ్మ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొలిమిపాళ్యంలో తెల్లవారుజాము వరకు పోలింగ్


మంగళవారం తెల్లవారుజాము వరకు క్యూ లైన్‌లో వేచి ఉన్న ఓటర్లు

కుందుర్పి, మే 14 : మండల పరిధిలోని కొలిమిపాళ్యంలో మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. దీంతో ఓటర్లు క్యూ లైన్‌లో ఉంటూ, అక్కడే నిద్రిస్తూ ఓపిగ్గా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈవీఎంలు 12 గంటలకు వరకే పనిచేసి, ఆగిపోయే పరిస్థితి ఉండడంతో ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని అక్కడున్న పోలింగ్ సిబ్బంది సమాచారం అందించారు. ఆర్డీవో రాణిసుస్మిత, డీఎస్పీ శ్రీనివాసులు, తహశీల్దారు హనుమంతు అక్కడికి చేరుకుని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మరో ఈవీఎంను ఉపయోగించి, తెల్లవారుజామున 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. 1201 ఓటర్లు ఉండగా.. 1086 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 92 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా మండల పరిధిలోని అపిలేపల్లి, తెనగల్లు, బెస్తరపల్లి కొన్ని గ్రామాల్లో అర్ధరాత్రి 12 గంటల వరకు పోలింగ్ సాగింది.



ముస్తాబైన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం

నేటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

ధర్మవరం, మే 14: పట్టణంలో ప్రసిద్ధి గాంచిన లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఉత్సవాల వివరాలను ప్రకటించారు. 15న ధ్వజారోహణం, 16న ఉదయం సూర్యప్రభవాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 17న ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం సింహవాహనం, 18న ఉదయం కల్పవృక్షవాహనం, సాయంత్రం హనుమద్‌వాహనం, 19న ఉదయం పల్లకీ ఉత్సవం, సాయంత్రం కల్యాణోత్సవం, 20న సాయంత్రం 9గంటలకు శేషవాహనంపై, రాత్రి 7గంటలకు గజవాహనంపై, 21న ఉదయం మరుగుతేరు(రథోత్సవం)ఉంటుందన్నారు. 22న సాయంత్రం అశ్వవాహనంపై, 23న ఉదయం పుష్పమండపై, 10గంటలకు వసంతోత్సవం, సాయంత్రం 6గంటలకు హంసవాహనం, 24న సాయంత్రం దేవతా ఉద్వాసన, 25న ఉదయం పుష్పయాగం, సాయంత్రం శయనోత్సవ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు. భక్తులు వీలైనంత మంగా పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని వారు తెలిపారు.

17నుంచి గంగాభవాని ఉత్సవాలు

గాండ్లపెంట, మే 14: మండలకేంద్రమైన గాండ్లపెంటలో వెలసిన గంగాభవాని అమ్మవారి 16వ వార్షిక ఉత్సవాలను ఈనెల 17నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. 17న ఉదయం 9గంటలకు కలశపూజ, అభిషేకం, అష్టోతర పూజ, తీర్థప్రసాదాలు, సాయంత్రం భజన కార్యక్రమాలు ఉంటాయి. 18న అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపులో బాణసంచా, కీలుగుర్రాలు, మంగళ వాయిద్యాలు, దమ, ఊరేగింపుతోపాటు, అర్చిస్తా ఉంటుందన్నారు. 19న తెల్లవారు జామున జ్యోతుల బోనాలు, సాయంత్రం ఉట్ల తిరునాళ్ల, అర్చిస్తా ఉంటుందన్నారు.



గంగాభవానీ అమ్మవారు

నేడు టీడీపీ నియోజకవర్గస్థాయి సమావేశం

పుట్టపర్తి, మే 14: తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10గంటలకు నల్లమాడ ఓడీసీ, అమడగూరు మండలాల నాయకులు,బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 3 గంటలకు పుట్టపర్తి కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. సమావేశంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిపై చర్చిస్తామని ఆయన వెల్లడించారు.

ఓట్లు..పోట్లు..!





- పెరిగిన పోలింగ్‌తో నేతల్లో అయోమయం
- ఎవరికి ఎన్ని ఓట్లు పడ్డాయో..లెక్కల్లో తలమునకలు

కదిరిఅర్బన్, మే 14: రెండు నెలలుగా జోరుగా ప్రచారం చేసి, ముందటిదలను సైతం లెక్క చేయకుండా తిరిగిన నేతలు ఎన్నికలు ముగియగానే రిలాక్స్ అయ్యారు. అయితే అసలైన కథ ఇప్పుడే మొదలయ్యింది. జరిగిన పోలైన ఓట్లతో ఎవరి జాతకాలు ఎలా మారనున్నాయి. నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారో విజయావకాశాలు ఎవరికున్నాయి. ఏవర్గం ఓట్లు ఎవరికి అనుకూలంగా పడ్డాయి. ఇదే ప్రధానంగా జరుగుతున్న చర్చ. ఆయాపార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఓట్ల లెక్కింపు అంచనాల్లో మునిగి తేలుతున్నారు. పోలైన ఓటింగ్ శాతం ఆధారంగా లెక్కలేస్తున్నారు. ఎవరికి వారు గెలుస్తామన్న ధీమా వ్యక్తం చేస్తున్నా జూన్ 4న వెలువడే ఫలితాలపైనే ఆశలు పెట్టుకున్నారు. ఆయా నియోజకవర్గాల్లో హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారం మొదలు, పోలైన ఓట్లు తీరును బట్టి ఏపార్టీకి ఎన్ని ఓట్లు పడ్డాయన్న అంచనాలను లెక్కేస్తున్నారు. కూడికలు, తీసివేతల్లో అభ్యర్థులు తలమునకలయ్యారు. పోలింగ్ శాతం భారీగా పెరగడంతో ఎవరికి అనుకూలం, ఎవరికి ప్రతికూలమనే చర్చ రాజకీయ వర్గాల్లో నెలకొంది. ప్రభుత్వంపై వ్యతిరేకతో ఓట్లు భారీగా ఓట్లు వేసినట్లు ఎన్‌డీఏ కూటమి వర్గాలు చెబుతున్నాయి. సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని అధికార పక్షం ధీమా వ్యక్తం చేస్తోంది. అన్నిపార్టీలు నమోదైన ఓటింగ్ శాతాన్ని బట్టి లెక్కలేస్తున్నాయి. గత ఎన్నికల్లో పార్టీలకొచ్చిన ఓట్లతో పోల్చితే ఈసారి మరెక్కువ బలం పెరిగింది. ఎక్కడ తగ్గిందన్న ఓలంచనాకు వస్తున్నారు. తుదితీర్పు వెలువడే గెలుపు ఎవరితో వేచి చూడాల్సిందే.

ఎక్కడ చూసినా ఇదే చర్చ

ఎక్కడ ఇద్దరు మాట్లాడినా, ఏనాయకుక్కినపలకరించినా, ఎవరు గెలుస్తారన్న చర్చ విపరీతంగా సాగుతోంది. నిష్పక్షపాతులు, ఇతర కార్యకర్తలను పలకరిస్తే గెలుపు, ఓటములపై ఆరాతీయడం కనిపిస్తోంది. రెండునెలలపాటు సుదూరమైనా ఎన్నట్లు ప్రచారం నిర్వహిస్తూ, అభ్యర్థుల గెలుపుకు ముమ్మర ప్రచారం చేశారు. హోటల్, టీస్టాల్, గ్రామ కూడలిల్లో అన్ని పార్టీల కార్యకర్తలు కలిసి ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడతారో లెక్కలేస్తున్నారు.



కదిరి పట్టణంలోని నిజాంవలీకాలనీలో బారులు తీరిన ఓటర్లు

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

ధర్మవరం, మే 14: పోలింగ్ ముగియడంతో అభ్యర్థుల గెలుపోటముల లెక్కల్లో మునిగి పోయారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ జయాపజయాలను బేరీజు వేసుకుంటున్నారు. అత్యంత ఉత్కంఠభరితంగాసాగిన ఎన్నికల్లో ధర్మవరం అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా సత్యకుమార్, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డివెంకటరామిరెడ్డి మధ్యనే నువ్వానేనా అన్నట్లు పోరు సాగింది. ఈ క్రమంలో వారిద్దరు అభ్యర్థులు నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన పోలింగ్ సరళి గురించి మండలాల వారీగా పార్టీ నాయకులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా నమోదైన పోలింగ్ శాతాన్నిబట్టి తమకు ప్లస్సా, మైనస్సా అనే కోణంలో లెక్కలు వేసుకుంటున్నట్లు తెలిసింది. అధికంగా పోలింగ్ నమోదు కావడంతో తమకే విజయావకాశాలు అధికంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా మహిళల ఓట్ల శాతం కూడా గణనీయంగా పెరగడంతో వారి ఓట్లు ఎవరికి అనుకూలంగా పడ్డాయోనని విస్తృత చర్చ జరుగుతోంది. కొత్తఓటర్లతో పాటు ఎస్‌సీలు, ఎస్టీలు, బీసీలు కూడా పెద్ద ఎత్తునవరివద్ద ఓటు హక్కును వినియోగించుకోవడంతో అవన్నీ తమకే అనుకూలమైనవన్న భావన కూటమి నాయకుల్లో నెలకొంది.



గాండ్లపెంట మండలం తాళ్లకాలువలో వేచివున్న ఓటర్లు

పెరిగిన పోలింగ్ శాతం

- పోటెత్తిన ఓటర్లు
- పలు మండలాల్లో రాత్రిదాకా..

గాండ్లపెంట, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం భారీగా పెరిగింది. గతంలో కన్నా ఈ సారి ఓటింగ్ పెరగడంతో గెలుపుపై నేతల్లో ఉత్కంఠ నెలకొంది. గాండ్లపెంట మండల వ్యాప్తంగా 24 పోలింగ్ కేంద్రాల్లో 21,485ఓట్లకు గాను 18,319 ఓట్లు పోలయ్యాయి. 85.2 శాతం నమోదయ్యింది.

తనకల్లు మండలంలో..

తనకల్లు: గతంలో ఎన్నడూ లేని విధంగా సార్వత్రిక ఎన్నికల్లో అధికంగా పోలింగ్ నమోదు కావడంతో టీడీపీ నేతలు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 86.10 శాతం పోలింగ్ నమోదయ్యింది. గ్రామీణ ప్రాంత ఓటర్లు ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం నుంచి బారులు తీరిన ఓటర్లు రాత్రి దాకా క్యూలైన్లలో ఉండి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో 47 పోలింగ్ కేంద్రాలుండగా ఏకేంద్రంలోనూ 70శాతానికి తక్కువగా ఓటింగ్ నమోదు కాలేదు. మండలంలోనే అత్యధికంగా మార్పురివాండ్లపల్లి పోలింగ్ కేంద్రం లో 95.35శాతం పోలింగ్ నమోదయ్యింది.

ఓడీచెరువులో 85.94 శాతం..

ఓబుళదేవరచెరువు: మండల వ్యాప్తంగా 44 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో 85.94 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికలాధికారి భాజాబీ, ఆర్‌ఐ నాగేంద్ర తెలిపారు. మండల వ్యాప్తంగా 39,234 ఓట్లు ఉండగా, 44 పోలింగ్ కేంద్రాల్లో 33,739 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని 206 కేంద్రంలో 944 మంది ఓట్లకు గాను 769మంది ఓటు వేశారు, 207లో 773కుగాను 596, 208లో 1,019కి 773మంది 209లో 604కుగాను 490మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వలస ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుని మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామునుంచే వలస ఓటర్లలో బస్సులు, బస్టాండ్ ప్రాంతం రద్దీగా కనిపించింది.

నల్లమాడలో 87.04 శాతం...

నల్లమాడ: మండల వ్యాప్తంగా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 87.04 శాతం నమోదైనట్టు ఎన్నికలాధికారి నాగభూషణం పేర్కొన్నారు. 39 పోలింగ్ కేంద్రాల్లో 33,582మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 14,781మంది, మహిళలు 14,552మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 29,230మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎన్పీకుంటలో

నంబులపూలకుంట: మండల వ్యాప్తంగా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 87శాతం పోలింగ్ అయింది. 24,552మంది ఓటర్లకు గాను 20,748మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెద్దపల్లి, ఎస్పీకుంట, మరికొ మ్మెదిన్నె గ్రామాల్లో ఆలస్యంగా పోలింగ్ ముగిసింది. వలస ఓటర్లు ఎక్కువగా ఓటుహక్కును వినియోగించుకున్నారు. నూతన ఓటర్లు ఉత్సాహంగా ఓటు వేశారు. ఎవరి గెలుపుపై ఇరుపార్టీల వారు గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రౌడీ మూకల ఆటకట్టిస్తా : కందికుంట

తనకల్లు, మే 14: మండలపరిధిలోని కనసానివారిపల్లి రౌడీమూకల ఆట కట్టిస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ హెచ్చరించారు. సోమవారం పోలింగ్ సందర్భంగా గొర్లవారిపల్లి పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డిపై కనసానివారిపల్లిరౌడీ మూకలు దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. దాడిలో గాయపడిన మధుసూదన్‌రెడ్డిని స్వగ్రామమైన దుగినేపల్లికి మంగళవారం పరామర్శించారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. టీడీపీ కార్యకర్తలను తన కుటుంబ సభ్యులుగా భావిస్తున్నానన్నారు. టీడీపీ కార్యకర్తపై దాడికి పాల్పడడం సరికాదని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కన్నెర్రచేస్తే తట్టుకోలేరని హెచ్చరించారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. ఆయనతోపాటు కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, సీనియర్‌నాయకులు దేగం శంకర్‌నాయుడు, మహబూబ్‌బాషా, మాజీ జెడ్పీటీసీ రవీంద్రారెడ్డి, తెలుగుయువత ప్రవీణ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, జయావల్లా, నాయకులు, కార్యకర్తలున్నారు.

మనసులు కలిపే మధ్యవర్తిత్వం..

- న్యాయాధికారి జయలక్ష్మి

కదిరిలీగల్, మే 14: కక్షలతో రక్తసంబంధాలకు కూడా దూరమై శాశ్వత శత్రువులుగా మారతారని, మధ్యవర్తిత్వం మనసులను కలిపి ప్రేమను పెంచుతుందని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయాధికారి ఎస్. జయలక్ష్మి సూచించారు. మీడియేషన్ యాక్ట్‌పై కదిరి కోర్టు ఆవరణంలో మంగళవారం శిక్షణాతరగతులు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయాధికారి జయలక్ష్మి మధ్యవర్తిత్వం ఆవశ్యకతను, అందులో దాగి ఉన్న ప్రయోజనాలను వివరించారు. అన్నదమ్ములు, బావ, బావమరదులు పొలం గట్టువద్ద తగాదాలుపెట్టుకుని కేసులు పెట్టుకుని శత్రువులుగా మారిపోతుంటారన్నారు. విడాకులు, రాజీయ మరణాలు, చిన్న చిన్న భూ తగాదాలను మధ్యవర్తిత్వం పరిష్కరించుకోవచ్చన్నారు. కోర్టులకు వచ్చే వ్యయప్రయాసలు, ఆర్థిక ఇబ్బందులు, దూరమవుతాయన్నారు. శిక్షణలో న్యాయవాద సంఘం అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ యల్లప్ప, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి జయలక్ష్మి

బాధితుడికి గోనుగుంట్ల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న గోనుగుంట్ల వర్గీయులు

ధర్మవరం, మే 14: పట్టణానికి చెందిన టైలర్ కుళ్లాయప్ప గత నెలలో పావగడకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగాగాయ పడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ రూ.25వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు ఆ మొత్తాన్ని గోనుగుంట్ల వర్గీయులు మంగళవారం బాధితుడి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ రామకృష్ణ, చిగిచెర్లశివందరెడ్డి, డిష్‌రాజు, బోడగలిగిరిధర్, దుస్సాక్షి,బలకం సూర్యనారాయణరెడ్డి, మార్కెట్‌నేసం, చీరన్న, ఓలేటిమురళి, గంధమనేని నారాయణస్వామి, నయ్యదీఖాషర్య, బొట్టుకిరణ్, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల రూట్‌మార్చ్



రూట్‌మార్చ్ నిర్వహిస్తున్న సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ శ్రీనివాస్

ధర్మవరం, మే 14: సార్వత్రిక ఎన్నికల ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముగిసినందుకు ధర్మవరం పట్టణంలో రూట్ మార్చ్ నిర్వహించారు. మంగళవారం సాయంత్రం డీఎస్పీ శ్రీనివాసులుఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం బీఎస్ఎఫ్ బలగాలతో రూట్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన అధికారులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బీఎస్ఎఫ్ స్పెషల్ ఫోర్స్ అందించిన సహకారం మరువలేనిదన్నారు.

బాలుర ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ కూడా..

గోరంట్ల, మే 14: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను అప్‌గ్రేడ్ చేసినందున 2024-25 వి ద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యాబోధన నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు గోపాల్ తెలిపారు. ఆయన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూ పులను ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతించింద ని తెలిపారు. కావున బాలుర ఉన్నతపాఠశాలలో చదివి ఇటీవల పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇది మంచి అవకాశమన్నారు. ఒక్కో గ్రూపులో 40మంది విద్యార్థులు చేరవచ్చన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడిని కలిసి తాము చేరనున్న గ్రూపు వివరాలు తెలపాలని కోరారు.



పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో

పల్లె ఆటోలకు పరిమితి ఏదీ?

- ఇష్టానుసారం ప్రయాణికులను తరలిస్తున్న ఆటో డ్రైవర్లు
- ప్రమాదాలు జరుగుతున్నా చలనం లేని అధికారులు

ధర్మవరం, మే 14: గ్రామీణ ప్రాంతాల నుంచి పలు పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే వారికి ఆటోలే గతి. ఆయారూ బస్సులున్నా అవి సమయానికి రావు. దీంతో ప్రయాణికులు ఎక్కువగా ఆటోలపైనే ఆధారపడుతూ ఉంటారు. అయితే ఆటో డ్రైవర్లు ఇష్టానుసారం పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. కొందరు ఆటో డ్రైవర్లు నిబంధనలకు నీళ్ల వదిలేస్తున్నారు. డ్రైవింగ్‌పై అవగాహన లేకుండా ఆటోలు నడుపుతుండంతో నగర,పట్టణ, గ్రామీణ పరిధిలోనిగ్ డ్రైవర్లు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. సత్యసాయిజిల్లా వ్యాప్తంగా దాదాపు 20-25వేల ఆటోలు ఉంటాయని రవాణాశాఖ గణాంకాలద్వారా తెలుస్తోంది. ధర్మవరం పట్టణంలో దాదాపు 4వేలకు పైగా ఆటోలు ఉన్నాయి.ఈ ఆటోలను నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్సులు కూడా లేకపోవడం, పరిమితికి మించి ప్రయాణికులను వేసుకుని వేగంగా ప్రయాణిస్తున్న వాటిని అదుపు చేసే అధికారులు కనిపించకపోవడంతో కొంతమంది యువకులు విచ్చలవిడిగా రోడ్లకు అడ్డంగా నిలిపివాహనాల రాకపోకలకు ఇబ్బందులు కల్గిస్తున్నారు.

క్రమశిక్షణ లోపించిన డ్రైవర్లు

ఆటోల సంఖ్య భారీగా ఉండటంతో వారి మధ్య పోటీ రోజురోజుకు పెరుగుతోంది. ప్రయాణికులు కనిపించగానే వారిపైపు దూసుకువెళ్తున్నారు. కూడళ్లలో, ఆర్టీసీ బస్సుస్టాప్‌లలో బస్సు నిలబడగానే నేరుగా పోయి వద్దకు తీసుకెళ్లి ఆటోను ఆపుతున్నారు. వచ్చిరానీ డ్రైవింగ్‌తో ఎదుటి వారిని హడలెత్తిస్తున్నారు. ఇద్దరు లేదా ముగ్గురు ఎక్కాల్సిన ఆటోలో 6 నుంచి 10 మందికి ఎక్కించుకుంటున్నారు. దీంతోప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోంది. ఆటోల్లో డెక్కులు, లౌడ్‌స్పీకర్లు పెట్టుకుని ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. వీటి కారణంగా ట్రాఫిక్‌లో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వెనుక వైపు నుంచి వచ్చే వాహనాలు గమనించకుండా ఉన్నఫలంగా యూటర్న్ తీసుకోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని అరికట్టాల్సిన ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేయడం మానేయడంతో కొంతమంది ఆటోవాలాలు ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారు. మరికొంతమంది ఆకతాయిలు మద్యం సేవించి తూలుతూ ఆటోలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. పోలీసులు మాత్రం ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే ఆటోల్లో చర్యలు తీసుకుంటున్నారు. ఆ తరువాత ఆటోలపై తనిఖీ చేయకపోవడంతో ఆటోవాలాలు విచ్చలవిడిగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇప్పటికైనా వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలంటూ ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయం లేకనే..

గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలను గ్రామీణ ప్రజలు ఆశ్రయిస్తున్నారు. దీనిని అలుసుగా చేసుకున్నఆటోవాలాలు ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించుకుని వెంటేసుకెళ్తున్నారు. డ్రైవర్లు ఇరువైపులా ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకుని ఆటోలను నడుపుతున్నారు. పోలీసులు, రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కర్ణాటక పోలీసులకు అవమానం

- పశువుల ట్రక్కులో విధులకు తరలింపు



పోలీసులను పశువుల ట్రక్కులో తరలిస్తున్న దృశ్యం

పావగడ, మే 14: జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు కోసం సోమవారం కర్ణాటక నుంచి బందోబస్తు కోసం వెళ్లిన పోలీ సులకు సరైన సౌకర్యాలు కల్పించలేదని, అవమానకరమైన రీతిలో వ్యవహ రించారని కొందరు పోలీసులు ఆవేదన వ్యక్తం చేశారు. బెంగళూరు నుంచి ఆంధ్ర ప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాకు బందోబస్తు కోసం వెళ్లేందుకు పోలీసు సిబ్బందిని పశువులను తరలించే ట్రక్కులో ఆ ప్రాంతంలోని రూట్ మ్యాప్‌కు పంపారని అక్కడకు వెళ్లిన పోలీసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి పగలు తమ కుటుంబాలను కూడా లెక్క చేయకుండా విధి నిర్వహణలో ఎంతటి త్యాగానికైనా సిద్ధమయ్యే పోలీసు వ్యవస్థపై ఇలా చిన్నచూపు చూడటం దారుణమైన విషయమన్నారు. తాము కర్తవ్యంలో ఉన్నందున విధి లేని పరిస్థితుల్లో ట్రక్కుల్లో వెళ్లాల్సి వచ్చిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు

మడకశిరలో ఆగిన అభివృద్ధి పనులు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మడకశిర, మే 14 : కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర రాష్ట్ర రాజధానికి, జిల్లా కేం ద్రానికి సుదూరంలో ఉంది. చాలా మారుమూల ప్రాంతం. ఈ ప్రాంతంలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభు త్వాలు మారినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఇక్కడి ప్రజలు ఆ వేదన వ్యక్తం చేస్తున్నారు. మడకశిర మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయ తీగా మారి పదేళ్లు దాటుతోంది. గత టీడీపీ హయాంలో మడకశిర పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దేందుకు రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేసింది. అయితే ప్రభుత్వం మారడంతో పనులు నిలిచి పోయాయి. పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు కొన్ని తొలగించారు, మరి కొన్నింటిని అలాగే ఉంచారు. తొలగించని స్తంభాలతో ట్రాన్స్‌ఫార్మర్లు కూడా రోడ్డుకు ఆను కునే ఉన్నాయి. దాదాపు రోడ్డు మధ్యలోనే ఉన్నాయని చెప్పవచ్చు. ఆసుపత్రి సమీపంలో ఒకటి, సంతమార్కెట్ సమీపంలో కూడలి వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ఇలా ఉన్నాయి. కూడలి మధ్యలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. ఐదేళ్లైనా మడకశిర పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ప్రతి ఇంటికీ తాగునీటిని అందించేందుకు రూ. కోట్లు నిధు లు మంజూరైనా 30 శాతం వరకు మాత్రమే పనులు జరిగాయి. మిగతా పనులు నిలిచి పోయాయి. అలాగే మడకశిర పట్టణం సుందరీకరణకు రూ. 50 కోట్లు మంజూరు కావడంతో 70 శాతం పనులు జరిగాయి. మిగిలిన 30శాత పనులు నాలుగేళ్లుగా నిలిచి పోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్ట ణంలో బాలికల ఉన్నత పాఠశాల భవనాల నిర్మాణం రెండేళ్లుగా అర్ధాంతరంగా నిలిచిపోయింది. చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో నిర్మాణం ముందుకు సాగక నిలిచిపోయినట్టు సమాచారం. మడకశిర పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అండర్ డ్రైనేజ్ కోసం ప్రతిపాదనలు పంపినా నేటికీ నిధులు మంజూరు కాలేదు. దీంతో వర్షాలు వచ్చినప్పుడు వరద నీరు రోడ్లపైకి వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పట్ట ణంలో పలు వార్డుల్లో సీసీ రోడ్లు వేశా రు గానీ డ్రైనేజీలు నిర్మించ లేదు. దీంతో వర్షాలు వచ్చినప్పుడు నీరు ఎక్కడి కక్కడ నిలబడి మురుగు గుంటలను తలపిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన మడకశిరలో బస్‌షెల్టర్లు లేక పోవడంతో ప్రయా ణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బస్సుల కోసం వేచి ఉండే సమయంలో నీడ కోసం దుకాణాల వద్ద ఎండలో ఉండే పరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాపుల వద్ద, కూడళ్ల లో బస్‌షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అర్ధాంతరంగా ఆగిన బాలికల ఉన్నత పాఠశాల భవనాలు

రాత్రి 11 వరకు పోలింగ్

హిందూపురం, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో పట్టణం కంటే పల్లెల్లో ఓటు శాతం బాగా పెరిగింది. పోలింగ్ రోజు సోమవారం కొన్నిచోట్ల పోలింగ్ సమయం ముగిసినా ఓటర్లు క్యూలైన్‌లోనే ఉన్నారు. రాత్రి 11 వరకు ఓటు వేశారు. హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా పది పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ జరిగింది. హిందూపురం పట్టణ పరిధిలోని కొట్నూరు, ముద్దిరెడ్డిపల్లి, లేపాక్షి మండలంలోని కంచిసముద్రం, చిలమత్తూరు మండలంలో మూడుచోట్ల రాత్రి వరకు కొనసాగింది. అయితే హిందూపురం మండలంలోని బీరేపల్లిలో రాత్రి 11గంటల వరకు ఓటర్లు క్యూలైన్‌లో ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 10వ నంబరు పోలింగ్ బూత్‌లో 1008ఓటర్లు ఉండగా 887మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు.

బాలుర ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ కూడా..

గోరంట్ల, మే 14: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను అప్‌గ్రేడ్ చేసినందున 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యాబోధన నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు గోపాల్ తెలిపారు. ఆయన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులను ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. కావున బాలుర ఉన్నతపాఠశాలలో చదివి ఇటీవల పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇది మంచి అవకాశమన్నారు. ఒక్కో గ్రూపులో 40మంది విద్యార్థులు చేరవచ్చాన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడిని కలిసి తాము చేరనున్న గూపు వివరాలు తెలపాలని కోరారు.

సవిత గెలుపు ఖాయం

ధీమా వ్యక్తం చేసిన టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, మే 14 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి గెలుపు ఖాయమని మాజీ ఎంపీపీ కేశవయ్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికలు పూర్తయిన తరువాత మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... పెనుకొండ నియోజకవర్గంలో అన్ని మండలాల ప్రజలు దాదాపు 82శాతం మంది స్వచ్ఛందంగా వచ్చి ఓటేశారన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై సోమవారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథికి మహిళలు, యువత, నిరుద్యోగులు అధికంగా ఓటు వేసినట్లు తెలిపారు. వారి గెలుపు తథ్యమని జోస్యం చెప్పారు. కార్య క్రమంలో నాయకులు వీజీ పాళ్యం శీన, టీడీపీ మండల మాజీ కన్వీనర్ శ్రీరాములుయాదవ్, గుట్టూరు సుబ్బరాయుడు, బోయ నాగరాజు, గుట్టూరు సూరి, రఘువీరచౌదరి, కోనాపురం రామలింగ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

పావగడ, మే 14: బెంగళూరు సప్తగిరి ఆస్పత్రి, పావగడ హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం తాలూకాలోని లింగదహళ్లిలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆరోగ్య శిబిరంలో స్త్రీరోగ నిపుణులు, హృద్రోగ నిపుణులు, న్యూరాలజీ, ఆర్థో, చర్మం, కంటికి సంబంధించిన జబ్బులకు శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారికి 60 శాతం తక్కువ ధరకే సప్తగిరి ఆస్పత్రిలో చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. ఈప్రాంతం ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

ఉరవకొండ, మే 14: వజ్రకరూరు మండల కేంద్రంలో మంగళవారం ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో సూరి(30) మృతి చెందాడు. ఉరవకొండ మండలం చిన్నముష్టూరు నుంచి ట్రాక్టర్‌లో బండలు వేసుకుని వెళ్తుండగా వజ్రకరూరు సమీపంలో ట్రాక్టర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి బోల్తాపడింది. ట్రాక్టర్‌లోని బండలు సూరిపై పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రాయదుర్గంరూరల్, మే 14: మండలంలోని బొమ్మక్కపల్లి సోమవారం రాత్రి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని వడ్రవన్నూరు గ్రామంలో మల్లికార్జున, మహారాజు, రామాంజి బొమ్మక్కపల్లి నుంచి వడ్రవన్నూరుకు వస్తుండగా వెనుక వైపు నుంచి కారు ఢీకొనడంతో గాయాలయ్యాయి. స్థానికులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సీఐ కారును ఢీకొన్న వాహనం

కళ్యాణదుర్గం రూరల్, మే 14: మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి సమీపంలో రాయదుర్గం రూరల్ సీఐ ప్రసాద్ వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మంగళవారం బోల్తా పడింది. కళ్యాణదుర్గంలో ఎన్నికల విధుల ముగించుకుని తిరుగు ప్రయాణంలో రాయదుర్గం వెళ్తున్న సీఐ కారును గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లింది. ఈ ఘటనలో సీఐ, డ్రైవర్‌కు కొద్దిపాటి గాయాలయ్యాయి.

ఓటర్లకు ఎన్నికల పండుగ

రెండు రోజుల పాటు ఉత్సాహం



గోరంట్లలో ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

గోరంట్ల, మే 14: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలు రెండురోజుల పాటు కుటుంబ సభ్యులతో కలిసి ఎన్నికల పండుగను సంతోషంగా జరుపుకున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నడూ లేని రీతిలో ఈ సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో అత్యధికంగా 80 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. మండలంలోని 70 పోలింగ్ కేంద్రాల్లో 64,432మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 32,050మంది, మహిళలు 32,380మంది ఉన్నారు. ఎన్నికల కోసం ప్రధాన రాజకీయ పార్టీల వారు బూత్‌లవారీగా తటస్థ ఓటరు, మద్దతుదారులు, వ్యతిరేకులు అని మూడు భాగాలుగా జాబితా రూపొందించారు. ఈ మేరకు వైసీపీ వారు ఓటుకు రూ.1500 చొప్పున, టీడీపీ వారు రూ.వెయ్యి చొప్పున తమ పార్టీ మద్దతు దారులు, తటస్తులకు పంపిణీ చేశారనడం బహిరంగ విమర్శ. తటస్త ఓటర్లకు ఇరుపార్టీల నుంచి డబుల్ ధమకారాబడిగా వచ్చినట్లు సమాచారం ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారు, వలసలు, ఉద్యోగులు, తదితరులు ఓటు వేయడానికి పెద్ద ఎత్తున స్వగ్రామా లకు తరలి వచ్చారు. వచ్చిన డబ్బుతో ఆదివారం విందు భోజనాలతో గడిపారు. సోమవారం సంతోషంగా ఓటు వేసి, పండుగ జరుపుకున్నారు. అనంతరం తామున్న ప్రాంతాలకు తిరుగుముఖం పట్టడంతో ఇక్కడ నుంచి వెళ్లే బస్సులు ప్రయాణికులతో కిక్కిరిశాయనడంలో అతిశయోక్తి లేదు.

నన్ను అడ్డుకునేందుకు విశ్వ ప్రయత్నాలు

అయినా గెలుపు నాదే : ఎంఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, మే 14:

నియోజకవర్గంలో తన గెలుపును అడ్డుకొనేందుకు శిఖండి రాజకీయాలు చేశారని, అవన్నీ పటాపంచలు చేస్తూ గెలువబోతున్నానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు అన్నారు. నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్ సరళిపై ఆయన మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలోని యాదవ కల్యాణ మండపం ఆవరణంలో జరిగిన ఈ సమావేశంలో ఎంఎస్ రాజు మాట్లాడుతూ... పార్టీ అధినేత చంద్రబాబు తనను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించే కొన్ని రోజుల ముందు నుంచి తనను నియోజకవర్గంలో ఓ రౌడీషీటర్ మాదిరి చూపేందుకు అనేక రకాలుగా ప్రయత్నం చేశారని అన్నారు. అయినా టీడీపీ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు తనను ఆదరించి గుండెల్లో పెట్టుకున్నారని.... వారి అభిమానాన్ని తన జీవితంలో మరువలేనన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి శిఖండి రాజకీయాలు మానుకోవాలన్నారు. తాను ఏదైనా ఎదురెదురు రాజకీయం చేస్తానన్నారు. తనను నాన్‌లోకల్‌గాను, ఇంకా తనపై అనేక అసత్య ప్రచారాలను తన చెంచాగాళ్లతో సోషల్ మీ డియాలో పెట్టించారని ఆరోపించారు. మీరు కళ్యాణదుర్గం, పెనుకొండలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు మీరు అక్కడ నాన్‌లోకల్ కాదా అనిప్రశ్నించారు. అధికార పార్టీ వైసీపీ, జీవంలేని కాంగ్రెస్ పార్టీ కలిసి తనపై అనేక అసత్య ప్రచారాలు చేశారని, వాటికి టీడీపీ నాయకులు, కార్యక ర్తలు దీటుగా సమాధానం చెప్పారన్నారు. తాను నేరుగా మాట్లాడే మనస్తత్వం గలవాడినని, పార్టీ అధికారంలోకి రాగానే నీతి నిజాయితీగా తన విజయానికి కృషి చేసిన ప్రతి టీడీపీ నాయకుడు, కార్యకర్త సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో టీడీపీ గెలవబోతోందని అనేక సర్వేల్లో ఇప్పటికే స్పష్టమైందని గుర్తు చేశారు. తాను మడకశిరకు వస్తే రఘువీరారెడ్డి పప్పులు ఉడకవని, తాను నేరుగా పోరాటం చేస్తానన్న విషయాన్ని ఆయన గతంలోనే చూశారన్నారు. తనపై అనేక అక్రమ కేసులు నమోదు చేయించారని, ప్రస్తుతం ఎమ్మెల్యే తిప్పేస్వామి వలె తాను ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడనన్నారు. అందరి అభీష్టం మేరకే నిర్ణయాలు తీసుకుంటానన్నారు. టీడీపీ గెలుపు కోసం కృషి చేసిన టీడీపీ, బీజేపీ, జనసేననాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస మూర్తి, నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిరలో ఆగిన అభివృద్ధి పనులు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నిలువ నీడలేని బస్టాపు

మడకశిర, మే 14: కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర రాష్ట్ర రాజధానికి, జిల్లా కేం ద్రానికి సుదూరంలో ఉంది. చాలా మారుమూల ప్రాంతం. ఈ ప్రాతంలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా తమ సమస్యలు పరిష్కారం కావ డం లేదని ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మడకశిర మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా మారి పదేళ్ల దాటుతోంది. గత టీడీపీ హయాంలో మడకశిర పట్టణాన్ని సర్వాంగ సందరంగా తీర్చి దిద్దేందుకు రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేసింది. అయితే ప్రభుత్వం మారడంతో పనులు నిలిచి పోయాయ. పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు కొన్ని తొలగించారు, మరి కొన్నింటిని అలాగే ఉంచారు. తొలగించని స్తంభాలతో ట్రాన్స్‌ఫార్మర్‌లు కూడా రోడ్డుకు ఆనుకునే ఉన్నాయి. దాదాపు రోడ్డు మధ్యలోనే ఉన్నాయని చెప్పవచ్చు. ఆసుపత్రి సమీపంలో ఒకటి, సంతమార్కెట్ సమీపంలో కూడలి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇలా ఉన్నాయి. కూడలి మధ్యలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. ఇకపోతే మడకశిర పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ప్రతి ఇంటికి తాగునీటిని అందించేందుకు రూ. కోట్లు నిధులు మంజూ రైనా 30 శాతం వరకు మాత్రమే పనులు జరిగాయి. మిగతా పనులు నిలిచి పోయాయి. అలాగే మడకశిర పట్టణం సుందరీకరణకు రూ. 50 కోట్లు మంజూరు కావడంతో 70 శాతం పనులు జరిగాయి. మిగిలిన 30శాత పనులు నాలుగేళ్లుగా నిలిచి పోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాల భవనాల నిర్మాణం రెండేళ్లుగా అర్ధంతరంగా నిలిచిపోయింది. చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో నిర్మాణం ముందుకు సాగక నిలిచిపోయినట్లు సమాచారం. మడకశిర పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అండర్ డ్రైనేజీ కోసం ప్రతిపాదనలు పంపినా నేటికీ నిదులు మంజూరు కాలేదు. దీంతో వర్షాలు వచ్చినప్పుడు పలుచోట్ల మురుగునీరు రోడ్లపైకి వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పట్ట ణంలో పలు చోట్ల సీసీ రోడ్లు వేశారు గానీ డ్రైనేజీల నిర్మాణం చేపట్టలేదు. దీంతో వర్షాలు వచ్చినప్పుడు నీరు ఎక్కడిక్కడ నిలబడి మురుగు గుంటలను తలపిస్తున్నాయి. నియోజకవ ర్గం కేంద్రమైన మడకశిరలో బస్‌షెల్టర్లు లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బస్టాపుల వద్ద మండు టెండలో గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉండే పరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాపుల వద్ద, కూడళ్లలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నిధులున్నా నిలిచిపోయిన పనులు



అర్ధంతరంగా ఆగిన బాలికల ఉన్నత పాఠశాల భవనాలు

క్రికెట్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, మే 14 :

స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో అనంతపురం క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-2 పోటీలను మంగళవారం నిర్వహించారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ మాంఛో ఫెర్రర్ టాస్ వేసి ఈ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... కరవు జిల్లాలో ఆంధ్రా, బీసీసీఐల సంయుక్త ఆధ్వర్యంలో ఏపీఎల్ పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు అవకాశం కల్పించి ప్రోత్సాహించడమే ఏపీఎల్ ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో యునైటెడ్ చాంపియన్స్ జట్టుపై ఇండియన్ సిక్సర్స్ జట్టు, అనంత రైజింగ్‌స్టార్స్ జట్టుపై గుత్తి జట్లు విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, మధు ఆచారి, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఏడీసీఏ సహాయ కార్యదర్శి భీమలింగారెడ్డి, కోశాధికారి షబ్బీర్ అహ్మద్, బీసీసీఐ కోచ్ శ్రీనివాసరెడ్డి, మాజీ రంజీ క్రీడాకారుడు షాబుద్దీన్, చంద్రమోహన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కోగటం విజయబాస్కర్ రెడ్డి, కోచ్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల్లో భవిత భద్రం

అనంతపురం టౌన్, మే 14 : జిల్లాలో ఓటింగ్ అనంతరం ఈవీఎంలు, వీవీ ప్యాట్లను జిల్లాకేంద్రంలోని జేఎన్‌టీయులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు సోమవారం రాత్రి తరలించారు. అధికారుల లెక్కల మేరకు ఈ ఎన్నికలలో జిల్లాలో కంట్రోల్ యూనిట్లు ఎనిమిది అసెంబ్లీలకు కలిపి 2,670, పార్లమెంటుకు 2,322 కంట్రోల్ యూనిట్లు, అలాగే అసెంబ్లీలకు 3,001, పార్లమెంటుకు 4,686 బ్యాలెట్ యూనిట్లు, అలాగే అసెంబ్లీలకు 3000, పార్లమెంటుకు 2,595 వీవీ ప్యాట్లు వినియో గించారు. సోమవారం ఎన్నికలు ముగిసిన తర్వా త పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన ప్రత్యేక వాహనాలలో పోలీస్ బందోబస్తు మధ్య జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ స్ట్రాంగ్‌రూమ్స్‌కు తీసుకొ చ్చారు. సోమవారం అర్ధరాత్రి దాటినా ఈవీఎంల స్వాధీనం, స్ట్రాంగ్‌రూమ్స్‌లలో భద్రపరచడం కొనసాగింది. ఇక్కడ కలెక్టరు వినోద్‌కుమార్, పరిశీలకులు ఐఏఎస్ మనీష్‌సింగ్, ఐపీఎస్ రవికుమార్ పర్యవేక్షణలో స్ట్రాంగ్‌రూమ్స్‌కు తరలించి భద్ర పరిచారు. సీసీ కెమెరాల నిఘాలో ఎస్పీ అమిత్‌బర్దర్ నేతృత్వంలో ప్రత్యేక బలగాలతో భద్రత చేపట్టారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ మేరకు కౌంటింగ్ వచ్చే నెల 4న చేపట్టనున్నారు.

పల్లె ఆటోలకు పరిమితి ఏదీ..?

● ఇష్టానుసారం ప్రయాణికులను తరలిస్తున్న ఆటోడ్రైవర్లు ● ప్రమాదాలు జరుగుతున్నా చలనం లేని అధికారులు



పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో

ధర్మవరం, మే 14: గ్రామీణ ప్రాంతాల నుంచి పలు పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే వారికి ఆటోలే గతి. అరకొర బస్సులున్నా అవి సమయానికి రావు. దీంతో ప్రయాణికులు ఎక్కువగా ఆటోలపైనే ఆధారపడుతూ ఉంటారు. ఆటోడ్రైవర్లు ఇష్టానుసారం పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. కొందరు ఆటో డ్రైవర్లు నిబంధనలకు నీళ్లు వదిలేస్తున్నారు. డ్రైవింగ్‌పై అవగాహన లేకుండా ఆటోలు నడుపుతుండంతో నగర,పట్టణ, గ్రామీణ పరిధిలోతిరిగే డ్రైవర్లు ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్నారు. సత్యసాయిజిల్లా వ్యాప్తంగా దాదాపు 20-25వేల ఆటోలు ఉంటాయని రవాణాశాఖ గణాంకాలద్వారా తెలుస్తోంది. .దర్మవరం పట్టణంలో దాదాపు 4వేలకు పైగా ఆటోలు ఉన్నాయి.ఈ ఆటోలను నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా లేకపోవడం, పరిమితికి మించి ప్రయాణీకులను వేసుకుని వేగంగా ప్రయాణిస్తున్న వాటిని అదుపు చేసే అధికారులు కనిపించకపోవడంతో కొంతమంది యువకులు విచ్చలవిడిగా రోడ్లకు అడ్డంగా నిలిపివాహనాల రాకపోకలకు ఇబ్బందులు కల్గిస్తున్నారు.

క్రమశిక్షణ లోపించిన డ్రైవర్లు

ఆటోల సంఖ్య భారీగా ఉండటంతో వారి మధ్య పోటీ రోజురోజుకు పెరుగుతోంది. ప్రయాణీకులు కనిపించగానే వారివైపు దూసుకువెళ్తున్నారు. కూడళ్లలో, ఆర్టీసీ బస్సుస్టాప్‌లలో బస్సు నిలబడగానే నేరుగా డోరు వద్దకు తీసుకెళ్లి ఆటోను ఆపుతున్నారు. వచ్చిరానీ డ్రైవింగ్‌తో ఎదుటి వారిని హడలెత్తిస్తున్నారు. ఇద్దరు లేదా ముగ్గురు ఎక్కాల్సిన ఆటోలో 6 నుంచి 10 మందికి ఎక్కించుకుంటున్నారు. దీంతోప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోంది. ఆటోల్లో డెక్కులు, లౌడ్‌స్పీకర్లు పెట్టుకుని ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. వీటి కారణంగా ట్రాపిక్‌లో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వెనుక వైపు నుంచి వచ్చే వాహనాలు గమనించకుండా ఉన్నఫళంగా యూటర్న్ తీసుకోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని అరికట్టాల్సిన ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేయడం మానేయడంతో కొంతమంది ఆటోవాలాలు ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారు. మరికొంతమంది ఆకతాయిలు మద్యం సేవించి తూలుతూ ఆటోలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. పోలీసులు మాత్రం ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే ఆటోలపై చర్యలు తీసుకుంటున్నారు. ఆ తరువాత ఆటోలపై తనిఖీ చేయకపోవడంతో ఆటోవాలాలు విచ్చలవిడిగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇప్పటికైనా వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలంటూ ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయం లేకనే..

గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలను గ్రామీణ ప్రజలు ఆశ్రయిస్తున్నారు. దీనిని అలుసుగా చేసుకున్నఆటోవాలాలు ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించుకుని బెంబేలెత్తిస్తున్నారు. డ్రైవర్‌కు ఇరువైపులా ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకుని ఆటోలను నడుపుతున్నారు. పోలీసులు, రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసులకు పశువుల వాహనం..!



పశువుల ట్రక్కులో వెళుతున్న కర్ణాటక పోలీసులు

పావగడ, మే 14: జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు కోసం సోమవారం కర్ణాటక నుంచి బందోబస్తు కోసం వెళ్లిన పోలీసులకు సరైన సౌకర్యాలు కల్పించలేదని, అవమానకరమైన రీతిలో వ్యవహరించారని కొందరు పోలీసులు అసహనం వ్యక్తం చేశారు. బెంగళూరు నుంచి ఆంధ్ర ప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాకు బందోబస్తు కోసం వెళ్లేందుకు పోలీసు సిబ్బందిని పశువులను తరలించే ట్రక్కులో ఆ ప్రాంతంలోని రూట్ మ్యాప్‌కు పంపారని అక్కడకు వెళ్లిన పోలీసులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాత్రి పగలు తమ కుటుంబాలను కూడా లెక్క చేయకుండా విధి నిర్వహణలో ఎంతటి త్యాగానికైనా సిద్ధమయ్యే పోలీసు వ్యవస్థపై ఇలా చిన్నచూపు చూడటం దారుణమైన విషయమన్నా రు. తాము కర్తవ్యంలో ఉన్నందున విధి లేని పరిస్థితుల్లో ట్రక్కులో వెళ్లాల్సి వచ్చిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు

ఘనంగా భగీరథ జయంతి



భగీరథుడి జయంతి ఉత్సవంలో పాల్గొన్న తాలూకా కార్యాలయ సిబ్బంది

పావగడ, మే 14: ఉప్పర కులస్థుల ఆరాధ్యదైవమైన భగీరథుడి జయంతిని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ సంతోష్‌కుమార్, ఉప్పర కులస్థులు, స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు భగీరథుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... భువి నుంచి దివికి గంగను తీసుకొచ్చేందుకు భగీరథుడు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. లక్ష్య సాధనలో ఆయన తీరు అందరికీ ఆదర్శనీయమన్నారు. ఉప్పర కులస్థులు, తాలూకా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని నీటి ట్యాంకు

ఇబ్బందులు పడుతున్న ఎస్సీకాలనీ వాసులు



ట్యాంక్ లేకుండా దర్శనమిస్తున్న సిమెంట్ దిమ్మె

రొద్దం, మే14 : మండలకేంద్రంలోని పాత ఎస్సీ కాలనీలో తాగునీటి అవసరాలకు గత టీడీపీ హయాంలో ట్యాంకు ఏర్పాటు చేశారు. సిమెంటు దిమ్మె కట్టి దానిపై సింథటిక్ ట్యాంకు ఏర్పాటు చేశారు. దానికి మూడు దిక్కులా కొళాయిలు అమర్చి కాలనీ వాసులు నీళ్లు పట్టుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఇది కాలనీ వాసులకు తాగునీటి కొరత తీర్చేది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాని నిర్వహణను వదిలేశారు. ట్యాంకుకు నీరు సరఫరా చేయలేదు. దీంతో కాలనీలో తాగునీటి సమస్య తలెత్తింది. అయినా పట్టించుకునే వారు లేరని కాలనీ వాసులు వాపో తున్నారు. నీరు సరఫరా చేయకపోవడంతో కొన్నాళ్లకు సింథటిక్ ట్యాంకు ఎండకు ఎండిపోయి పూర్తిగా పాడై పోయింది. ముక్కలై రాలిపోయింది. ప్రస్తుతం సిమెంటు దిమ్మె మాత్రం అక్కడ దర్శనమిస్తోంది. కొత్తట్యాంకు ఏర్పాటు చేసి కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎన్ని మార్లు సర్పంచుకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. టీడీపీ వారు చేపట్టిన అభివృద్ధి పనులను తామెందుకు కొనసాగించాలని గాలికి వదిలేసినట్లుందని పలువురు విమర్శిస్తున్నారు. ఏదిఏమైనా కాలనీ వాసులు తాగునీటి సమస్య తీరలేదు.



ఉత్సవాలకు ముస్తాబైన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం

నేటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

ధర్మవరం, మే 14: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఉత్సవాల వివరాలను ప్రకటించారు. 15న ధ్వజారోహణం, 16న ఉదయం సూర్యప్రభవాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 17న ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం సింహవాహనం, 18న ఉదయం కల్పవృక్షవాహనం, సాయంత్రం హనుమద్‌వాహనం, 19న ఉదయం పల్లకీ ఉత్సవం, సాయంత్రం కల్యాణోత్సవం, 20న సాయంత్రం 3గంటలకు శేషవాహనంపై, రాత్రి 7గంటలకు గజవాహనంపై, 21న ఉదయం మరుగుతేరు(రథోత్సవం)ఉంటుందన్నారు. 22న సాయంత్రం అశ్వవాహనంపై, 23న ఉదయం పుష్పమండంపై, 10గంటలకు వసంతోత్సవం, సాయంత్రం 6గంటలకు హంసవాహనం, 24నసాయంత్రం దేవతా ఉద్వాసన, 25న ఉదయం పుష్పయాగం, సాయంత్రం శయనోత్సవ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని వారు తెలిపారు.

17నుంచి గంగాభవాని ఉత్సవాలు



గంగాభవాని అమ్మవారు

గాండ్లపెంట, మే 14: మండలకేంద్రమైన గాండ్లపెంటలో వెలసిన గంగాభవాని అమ్మవారి 16వ వార్షిక ఉత్సవాలను ఈనెల 17నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. 17న ఉదయం 9గంటలకు కలశపూజ, అభిషేకం, అష్టోతర పూజ, తీర్థప్రసాదాలు, సాయంత్రం భజన కార్యక్రమాలు ఉంటాయి. 18న అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపులో బాణసంచా, కీలుగుర్రాలు, మంగళ వాయిద్యాలనడుమ, ఊరేగింపుతోపాటు, ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు. 19న తెల్లవారు జామున జ్యోతుల బోనాలు, సాయంత్రం ఉట్ల తిరునాళ్ల, ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు.